క్లుప్తంగా

'పీజీఆర్ఎస్'కు 5 వినతులు



అర్జీ స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ఐదు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆర్ఐ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన అర్జీల పరిష్కారం

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్‌-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రెండు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బి.రాము స్వీకరించి పరిశీలించారు. వాటర్ సప్లై విభాగానికి 01, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

కత్తితో దాడి చేసిన నిందితుడికి రిమాండ్



నిందితుడు ప్రసాద్

సీతమ్మధార: కత్తితో దాడి చేసిన నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన అంధవరపు ప్రసాద్ హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలో పనిచేస్తున్నాడు. అతని తల్లి గుంటూరులో నివాసం ఉంటున్నారు. ఈనెల 9వ తేదీన వ్యక్తిగత పనుల నిమిత్తం విశాఖలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ప్రసాద్ వచ్చాడు. సమీపంలో గల ఒక డార్మిటరీలో దిగాడు. అదే డార్మిటరీలో కైలాసపురానికి చెందిన రాజేష్, సాయితో పరిచయం ఏర్పడింది. దీంతో ఈనెల 15వ తేదీన పెదవాల్తేరులో సాయి పుట్టినరోజు వేడుకలు ప్రసాద్, రాజేష్ హాజరయ్యారు. సరదాగా ఆటపట్టించాలనే నెపంతో రాజష్ ఫోన్‌ను ప్రసాద్ దాచేశాడు. దీంతో ఇద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. అనంతరం ఇద్దరూ వేర్వేరు సమయాల్లో డార్మిటరీకి చేరుకున్నారు. రాజేష్‌ను చూసిన ప్రసాద్ కోపంతో కత్తితో దాడి చేశాడు. దీంతో రాజేష్ తీవ్రంగా గాయపడ్డాడు. ద్వారకా పోలీసులకు రాజేష్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీంతో పోలీసులు నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేసిన కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ డి.వి.రమణ, ఎస్ఐ ధర్మేంద్ర తెలిపారు.

పేదలకు వితరణ



పేదలకు దుస్తులు అందిస్తున్న గొల్లమూల అప్పారావు

కంచరపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చెప్పినట్టు పేదల ఆకలి చావులు లేని దేశంగా చూసినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు గొల్లమూల అప్పారావు అన్నారు. ఊర్వశి కూడలి అంబేడ్కర్ భవనంలో సోమవారం పేదలకు అన్న, వస్త్రదానాలు చేశారు. సుమారు 300 మందికి అన్నదానం, 100 మందికి వస్త్రదానం చేసినట్లు సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్.వెంకటరావు, బి.మూర్తి, బి.అప్పారావు, ఎన్.గణేష్, కె.నాగేశ్వరరావు, బి.తిరుపతి, ఎస్.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మహాగణపతికి పూజలు



సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి దేవస్థానంలో సోమవారం సంకటహర చతుర్థి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి వారిని సుగంధ ద్రవ్యాలతో అభిషేకించిన అనంతరం వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానంలో ఉదయం నుంచే భక్తులు పూజలు చేశారు. ప్రత్యేక పూజల సందర్భంగా దేవాలయ ఆవరణలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్, అర్చకులు రాజాస్వామి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలు కనుమరుగు



80 ఫీట్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై అడ్డంగా ఏర్పాటు చేసిన బిర్యానీ పాయింట్



మహారాణి పార్లర్ వద్ద ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన జ్యూస్ షాప్



80 ఫీట్ రోడ్డులో ఫుట్‌పాత్‌ను పూర్తిగా మూసివేసి నడుపుతున్న జ్యూస్ షాప్

- అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- ఇష్టారాజ్యంగా వ్యాపారాల నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న పాదచారులు, వృద్ధులు
- చోద్యం చూస్తున్న అధికారులు

సీతంపేట: పది మందికి ఉపయోగపడాల్సిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. వ్యాపారుల ఆక్రమణలతో పాదచారులకు అక్కరకు రాకుండా పోతున్నాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా పాదచారులు నడవడానికి వీలుగా కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన కాలిబాటలు చిరు వ్యాపారాలకు అడ్డాగా మారి కనుమరుగవుతున్నాయి. జీవీఎంసీ 43, 44 వార్డుల పరిధి అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ నుంచి తాటిచెట్లపాలెం కూడలి వరకు విస్తరించి ఉన్న 80 ఫీట్ రోడ్డును రూ.1.50 కోట్లతో 2018లో అభివృద్ధి చేశారు. రోడ్డు విస్తరణ చేపట్టి, రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించి, దానిపై టైల్స్ వేశారు. కొంత మంది వ్యాపారులు తమ దుకాణం ముందున్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించేశారు. మరికొందరు తమ షాపు ముందున్న ఫుట్‌పాత్‌లను జ్యూస్ షాపులు, కర్రీపాయింట్లకు రోజువారీ, నెలవారీ అద్దెలకు ఇస్తున్నట్టు తెలుస్తోంది. వ్యాపారుల ఆక్రమణలతో అసలు ఫుట్‌పాత్‌లు ఉన్నాయా అన్న సందేహం కలుగుతోంది.

మహారాణి పార్లర్ నుంచి ఆక్రమణలు

మహారాణి పార్లర్ నుంచి రామచంద్రానగర్ ఆర్చి వరకు గల 80 అడుగుల రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. జ్యూస్ షాపులు, కర్రీపాయింట్లు, టిఫిన్ షాపులు, కూరగాయల వ్యాపారాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మెకానిక్ షాపులు, టిఫిన్ బళ్లు, ఫర్నీచర్ షాపులు ఇలా రోడ్డుకు ఆనుకొని ఉన్న వ్యాపారులు వారి దుకాణం ముందున్న ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో పాదచారులు నడిచే వీలు లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురయినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని కోరుతున్నారు.



గౌరీ కల్యాణ మండపం వద్ద ఫుట్‌పాత్‌కు అడ్డుగా పేర్చిన టైర్లు



గౌరీ మండపం ఎదురుగా ఫుట్‌పాత్‌పై రేకుల షెడ్డు నిర్మించి వినియోగిస్తున్న వెల్డింగ్ షాపులు

కాలిబాటలపై నడిచే వీలు లేదు

అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డు నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. వృద్ధులు, పిల్లలు నడవాలంటే భయపడుతుంటారు. ఈ మార్గంలో లక్షల రూపాయలు వెచ్చించి ఫుట్‌పాత్‌లు నిర్మించారు. పాదచారులు నడవడానికి ఉపయోగపడుతుందని ఆనంద పడ్డాం. నడిచే వీలు లేకుండా వ్యాపారులు పూర్తిగా ఆక్రమించేశారు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలి.

– ఎస్.వెంకటరమణ, రామచంద్రానగర్

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించాలి

లక్షలు రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఫుట్‌పాత్‌లు ప్రజలకు ఉపయోగపడుతున్నాయా లేదా అని కూడా ఎవరూ ఏనాడు పట్టించుకోలేదు. పది మంది నడవడానికి నిర్మించిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించినా అడ్డుకోవాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది. దీంతో ప్రజా ధనం వృథాగా మారినట్టయింది. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– కె.నరసింగరావు, అక్కయ్యపాలెం

అమరజీవికి ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, సభ్యులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాన ప్రకాష్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య, పూర్వ అధ్యక్షులు కృష్ణారావు, పల్లా చంద్రమౌళి, కార్యదర్శి ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి ఎన్.ప్రకాష్, జాలీ వాకర్ ఎస్.మాధవి, ఎన్.అప్పారావు, పి.శ్రీనివాసరావు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు వృద్ధుడు



వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: నల్ల గడుల షర్ట్ వేసుకున్న వృద్ధుని పేరు నారాయణరావు, వయసు 62 ఏళ్లు. ఇతను ఉండేది నగరంలోని వెంకటేశ్వర కాలనీ. ఈ నెల 3న ఏయూటీడీ ఫీల్డ్ విజిట్‌లో ఇతని దీన స్థితిని చూసి జీవీఎంసీ–ఏయూటీడీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. కుటుంబ వివరాలు అడిగితే చెప్పడానికి ఇష్టపడలేదు. దీంతో అల్లుడు వై.దుర్గారావు, కుమార్తె భవాని తండ్రి ఆచూకీ తెలుసుకుని షెల్టర్‌కి సోమవారం వచ్చారు. కూతురు, అల్లుడితో గొడవ పడి వచ్చేసినట్లు వారి ద్వారా తెలిసింది. తండ్రి ఆపద సమయంలో ఉంటే ఆశ్రయం కల్పించినందుకు ఏయూటీడీకి, జీవీఎంసీకి ధన్యవాదాలు తెలిపి, నారాయణరావును అల్లుడు, కూతురు వెంట తీసుకెళ్లారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



ఎస్ఎంసీ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న టెన్త్ విద్యార్థులు



మధురానగర్ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



మధురానగర్ పరీక్ష కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: నియోజకవర్గంలో సోమవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన 16 పరీక్షా కేంద్రాల్లో తొలి రోజు తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరిగింది. 25, 26 వార్డుల్లో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధురానగర్‌లోని జీవీఎంసీ హైస్కూల్, రాజేంద్రనగర్‌లోని వీటీ హైస్కూల్, అక్కయ్యపాలెంలోని జ్ఞాననికేతన్ హైస్కూల్, ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్ పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం 8 గంటల నుంచే వారంతా పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను తనిఖీ చేసి 8.30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. తమ సీటు నంబర్ ఏ రూమ్‌లో కేటాయించారో తెలుసుకోవడానికి హాల్ టికెట్ నంబరు వెతుకులాడుతూ స్టూడెంట్లు కనిపించారు. వెంట వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలకు జాగ్రత్తలు చెబుతూ పరీక్ష హాల్‌లోకి సాగనంపారు.

196 మంది హాజరు

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీ ఎస్ఎంసీ హైస్కూల్ పరీక్ష కేంద్రం వద్ద తల్లిదండ్రులు, విద్యార్థుల కోలాహలం కనిపించింది. ఈ పాఠశాలలో తొలి రోజు 200 మంది విద్యార్థులకు గాను నలుగురు సప్లిమెంటరీ విద్యార్థులు గైర్హాజరయ్యారు. తెలుగు పరీక్ష జరుగుతున్నంత సేపూ పాఠశాల బయట తల్లిదండ్రులు వేచి ఉండటం విశేషం. ద్వారకా పోలీసులు పాఠశాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. వంద మీటర్ల పరిధిలో జెరాక్స్ దుకాణాలు మూయించేశారు.

పకడ్బందీగా..

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ప్రధానోపాధ్యాయిని బి.హేమలత పర్యవేక్షణలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించారు. ఈ కేంద్రానికి 202 మంది విద్యార్థులను కేటాయించగా.. ఇద్దరు(ప్రైవేట్ సప్లమెంటరీ) పరీక్షలకు హాజరు కాలేదు. విద్యార్థులకు అవసరమైన మినరల్ వాటర్ జీవీఎంసీ సరఫరా చేసినట్లు హెచ్ఎం తెలిపారు.

- ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ ఉన్నత పాఠశాల కేంద్రంలో హెచ్ఎం ఎస్ఎస్ఎం సాయిలక్ష్మి పర్యవేక్షణలో టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించారు. తెలుగు పరీక్షకు 202 మందిని కేటాయించగా అందరూ హాజరయ్యారు. వీరిలో ఇద్దరు ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. బుధవారం హిందీకి 200 మందిని కేటాయించినట్లు హెచ్ఎం సాయిలక్ష్మి చెప్పారు. ఎంఎస్ఎం పాఠశాలకు 207 మంది విద్యార్థులకు కేటాయించారు. సీఎస్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయి.

సందడిగా పరీక్ష కేంద్రాలు

కంచరపాలెం: కంచరపాలెం, ఐటీఐ జంక్షన్, మర్రిపాలెం, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాల వద్ద పండగ వాతావరణం నెలకొంది. ఉదయం 8 గంటలకే తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. జ్ఞానాపురం సేక్రెడ్ హార్ట్, ఏకేఎం జూబ్లీ, కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట హైస్కూల్, ఐటీఐ జంక్షన్ పరిధి కప్పరాడ ఉన్నత పాఠశాలల్లో తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు, ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది సేవలందించారు.



మాధవధార పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



ఆర్పీ పేట పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు



కంచరపాలెంలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న దివ్యాంగ విద్యార్థి

అక్కయ్యపాలెంలో చోరీ

- 17 తులాల బంగారు ఆభరణాలు, రూ.25 వేలు అపహరణ



చెల్లాచెదురుగా బీరువాలోని వస్తువులు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. బంగారం, నగదు దోచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అక్కయ్య పాలెం మహారాణి పార్లర్ సమీపంలోని ఎంటీ కాలేజీ రోడ్డులో సరోజా ఆస్పత్రి సమీపంలో ఫొటోగ్రాఫర్ రెయ్యి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. కింది అంతస్తులో తల్లిదండ్రులు వాసుదేవరావు, లక్ష్మీకాంతమ్మ ఉంటున్నారు. గోపాలపట్నం సమీపంలోని చంద్రంపాలెంలో తమ కుమార్తె ఇల్లు కట్టుకోవడంతో చూసేందుకు వాసుదేవరావు, లక్ష్మీకాంతం వెళ్లారు. రాత్రికి అక్కడే ఉండిపోయారు. కుమారుడు శ్రీనివాసరావు రాత్రి పది గంటలసమయంలో ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం శ్రీనివాసరావు తల్లిదండ్రులు ఉంటున్న దిగువ పోర్షన్‌కు వచ్చి చూడగా..ఇంటి తాళాలు తెరిచి ఉండడం గమనించి బీరువా తనిఖీ చేయగా 17 తులాల బంగారం ఆభరణాలు చోరీ అయ్యాయని గుర్తించారు. నాలుగు గాజులు, రెండు చైన్లు, నల్లపూసల దండ, మూడు ఉంగరాలు, చెవిదుద్దులు, రూ.25వేలు చోరీ అయ్యాయయని గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొత్తం మీద రూ4.50 లక్షల మేరకు చోరీ జరిగినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటన స్థలానికి క్రైం డీసీపీ లతా మాధురి , ఏసీపీ లక్ష్మణరావు, సీసీఎస్ సీఐలు కోరాడ రామారావు, సీఐ శంకర నారాయణ, ఫోర్త్ టౌన్ క్రైం సీఐ రాజులునాయుడు, ఫోర్త్ టౌన్ క్రైం ఎస్ఐ సత్యారావు చేరుకుని వివరాలు సేకరించారు. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును సీఐ రాజులనాయుడు పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ధర్నా



డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు

తాటిచెట్లపాలెం: రైల్వేలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం దొండపర్తిలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద ధర్నా చేశారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్స్(ఎన్ఎఫ్ఐఆర్ – న్యూఢిల్లీ) జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ ప్రెసిడెంట్ జె.సంపత్‌కుమార్ మాట్లాడుతూ న్యూ పెన్షన్ స్కీం వల్ల రైల్వే కార్మికులు ఎంతో నష్టపోతున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎన్ఎఫ్ఐఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్ స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీంను ప్రవేశపెట్టిందని, దీనిలో కూడా కార్మికులకు నష్టం చేసే పలు అంశాలున్నందున పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, కోవిడ్ సమయంలో నిలిపేసిన డీఏ, డీఆర్‌లను విడుదల చేయాలని, 8 గంటల రోస్టర్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. డివిజనల్ కో ఆర్డినేటర్ టి.వి.మాళీశ్వరరావు మాట్లాడుతూ రైల్వే ప్రొడక్షన్ యూనిట్ల ప్రైవేటీకరణ ప్రతిపాదనలు విరమించుకోవాలన్నారు. అనంతరం సుమారు 47 ప్రధాన డిమాండ్లతో కూడిన మెమోరాండంను డీఆర్ఎం లలిత్ బోరాకు శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో శ్రామిక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.నరసింగరావు, డిప్యూటీ డివిజనల్ కో ఆర్డినేటర్ ఎ.వి.రావు, అడిషనల్ జాయింట్ జనరల్ సెక్రటరీ కె.నాగేశ్వరరావు, కేంద్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు, ఎన్ఎఫ్ఐఆర్ వర్కింగ్ కమిటీ సభ్యులు పాపారావు, ఆర్ఎం పాత్రో, లోకో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ చిన్నోడు, డివిజన్ పరిధిలోని అన్ని బ్రాంచ్‌ల సెక్రటరీలు, అధిక సంఖ్యలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాళ్లు కేటాయిస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు సోమవారం ఈవో కృష్ణమూర్తి డ్రా తీసి రైతులకు కేటాయించారు. స్టాల్ నంబర్లు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, వ్యాపారులు వారికి కేటాయించిన స్టాళ్లలోనే కూరగాయలు విక్రయించాలని స్పష్టం చేశారు. స్టాళ్లు ఉన్న వారు కూరగాయలు నేల మీద వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, ఉదయం, సాయంత్రం బజార్ల రైతులు పాల్గొన్నారు.

గెడ్డ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, శ్యామలాదీపిక

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో రూ.19.87 లక్షలతో చేపట్టనున్న గెడ్డ పనులకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ కాలనీ సులభ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న గెడ్డ రిటైనింగ్ వాల్, బాటమ్ కాంక్రీట్ పనులకు సంబంధించి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలాదీపికతో కలసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మీడియాతో రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ వార్డులో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం డీఈ రత్నాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు బి.తిరుమల రావు, పొన్నాడ అప్పారావు, రామారావు, సింహాచలం, ప్రసూనారెడ్డి, ఎర్నిబాబు, శ్యామ్, చిన్ని, గణేష్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ పరిరక్షణకు ఉద్యమం ఉధృతం

దాబాగార్డెన్స్: పోర్టు హాస్పిటల్ పరిరక్షణకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నట్లు యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్, వీడీఎల్పీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు తెలిపారు. సిటూ కార్యాలయంలో ఉద్యమ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఆయా యూనియన్ల నాయకులు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలని, రీటెండర్ ప్రక్రియ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు ఈ నెల 18 నుంచి ఉద్యమం తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 18న పోర్టు ప్రాంగణంలో గేట్ మీటింగ్‌లు, 24 నుంచి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన, ఏప్రిల్ ఒకటి నుంచి పోర్టు ఉద్యోగుల నివాస ప్రాంతాల్లో నిరసనలు, ఏప్రిల్ 9న చలో ఏవోబీ కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. హాస్పిటల్‌ను కాపాడుకునేందుకు జరిగే పోరాటంలో కార్మికులు, పెన్షనర్లు ఐక్యంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు, ఫెడరేషన్ కార్యదర్శి బి.జగన్, యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామలింగేశ్వరరావు, వీడీఎల్పీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జక్కాన సత్యనారాయణ, కార్యదర్శి బి.లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ద్వారకా ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార: వాహన చోదకులందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ పి.ప్రతాప్‌కుమార్ సూచించారు. సత్యం జంక్షన్, రామాటాకీస్, ఆశీలమెట్ట ప్రాంతాల్లో సోమవారం డెల్టా–1, సీఐ కె.ఎస్.ఎన్.వి.ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించని చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో వాహనం సీజ్ చేస్తామని హెచ్చరించారు. పెండింగ్ చలానాలు చెల్లించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్ ప్రయాణ చేయరాదని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదన్నారు. వాహనాలు నడిపే వారు, రోడ్డు దాటే పాదచారులు సెల్‌ఫోన్లలో మాట్లాడటం, బస్సుల్లో ఫుట్‌పాత్ ప్రయాణాలు ప్రమాదకరమని హెచ్చరించారు. ఏఎస్ఐ, సూర్యనారాయణ, బి.నాయుడు, హోంగార్డ్ రాము పాల్గొన్నారు.

బార్లలో పోలీసుల తనిఖీలు

విశాఖ సిటీ: విశాఖలో బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌లపై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. సుమారు 450 పోలీస్ అధికారులు, సిబ్బందితో 92 బృందాలుగా 104 బార్లు, పబ్‌ల్లో ఏకకాలంలో తనిఖీ చేపట్టారు. ఇందులో సంబంధిత శాఖల నుంచి లైసెన్సులు లేకుండా వ్యాపారం, మైనర్లకు మద్యం విక్రయాలు, ఫైర్ ఎన్‌ఓసీలు, సీసీటీవీ, అక్రమ మద్యం, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయాలు ఇలా అనేక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో 23 బార్లలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. 14 బార్లకు ఫైర్‌ఎన్ఓసీ, 2 బార్లలో సీసీటీవీ కెమెరాలు, ఒకచోట ఫుడ్ లైసెన్స్ లేకుండా రెస్టారెంట్ నిర్వహణ, ట్రేడ్ లైసెన్సులు లేకుండా 2, పార్కింగ్ సదుపాయం లేకుండా 14, జీఎస్టీ లేకుండా ఒక బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నట్లు తేల్చారు. సదరు బార్లపై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సిఫార్సు చేశారు.